కథ

# ప్రహేళిక

మధురాంతకం నరేంద్ర

''యెర్రావారిపాళెం దేవరిండ్లకు పొయ్యి సోదిరంగం జెయ్యించి జబాబు తెల్సుకోవాల. అంతదాంకా నాకు నిమ్మళంగా వుండదు'' అంది చెంచమ్మ తనను తాను వోదార్చుకుంటున్నట్టుగా.

''ఆ పొద్దు మీ అమ్మ సోదిగాని వొళ్ళుపైకొచ్చి యేంజెప్పింది? ఆడది లేకుండా మీనాయిన గెడిసేపు వుండ్లేనని చెప్పిందాలేదా? యిప్పుడు మళ్ళా రంగం జెయ్యించమని నా పాణం తియ్యొద్దు. చిన్నాచితకా పశ్నలకంతా ఖర్చుజేసి జబాబులు జెప్పించేంత దుడ్డు నా దగ్గరలేదు.'' అని విసుక్కున్నాడు బత్తయ్య.



పదిబారలు సాగిపోయిన ఆదెయ్య మళ్లీ గుడిసె దగ్గరికి తిరిగొచ్చి ''మళ్లా చెప్తావుండాను... రేపు సాయంత్రానికంతా నా కమ్మలు నా చేతిలో వుండాల్ల కావాల్ల... లేకపోతే గొమ్మునుండను'' అన్నాడు. తడినేలలో గునపాన్ని దిగేసినంత కరకుగా.

యేడుపు పొంగుకొస్తున్న గొంతుతో ''అవ్వి నీ కమ్మ కట్లయినాయి నాయినా? మా అమ్మ నాకు యిచ్చినవయ్యి...'' అంది చెంచమ్మ.

''రేపు నా సొత్తు నాకు చేరకుండా పోతే అప్పుడు చెప్తాను ఆ పశ్నకు జబాబు...'' అంటూ ఆదెయ్య గాండ్రించాడు.

''అట్నే తేల్చుకుందాం లే రాపో మామా!'' అని బత్తయ్య సవాలు విసిరాడు.

''నా సంగతి బాగ దెలుసుకదా? నా మాటినకపోతే ఆడియాలం లేపేస్తాను. కన్నబిడ్డని గూడా జూడను బాంచెల్'' పెద్దగా అరుస్తూనే ఆదెయ్య వెళ్ళిపోయాడు.


బత్తయ్య గుడిసెలోంచీ బయటి కొచ్చి, గడప పక్కన నాటిన కొయ్య స్టాండు పైనున్న స్టార్టరు మీటను నొక్కాడు. అంత వరకూ కారు బారు చేసిన బోరింగు మిషను గొంతు నొక్కుకుంది.

తూర్పున కొండలు లేకపోవడంతో తొందరగా బయటపడిన నీరెండ లేత నీడల్ని పరుస్తోంది. గుడిసె చుట్టూ చిన్నచిన్న రాళ్ళు పాతి యిళ్ళ స్థలాలుగా మార్చిన మైదానంలో పిచ్చి మొక్కలూ, తుమ్మపొదలూ బలిసిపోయి వున్నాయి. వుత్తరాన శేషాద్రి కొండల దగ్గరి నుంచీ శివార్ల వరకూ వ్యాపించిన వీధుల్లో యిండ్లు కిక్కిరిసిపోయి వున్నాయి. అక్కడి నుంచీ దక్షిణపు గుట్టల వరకూ పరుచుకున్న బీళ్ళలో అక్కడక్కడా కడుతున్న యిండ్లు మధ్య తరగతి వాళ్ళ పిల్లల్లా బలహీనంగా కనబడుతున్నాయి. వాటి ముందు కాపలా వాళ్ళ కోసం కట్టిన గుడిసెలు పిచ్చుకుంట్ల వాళ్ళ పిల్లల్లా దుమ్ము గొట్టుకుపోయి, వికారంగా కనబడు తున్నాయి.

బోరింగు దగ్గరి నుంచీ, దీర్ఘ చతురస్రాకా రంలో రెండడుగులదాకా పైకి లేచిన పునాది గోడల వరకూ సాగిన రబ్బరు గొట్టాన్ని చుట్టజుట్టి గుడిసెలోకి తీసుకొచ్చాడు బత్తయ్య. కుక్కి మంచంలో వుయ్యాలలా వూగుతున్న నారపోగుల పైన పడుకున్న చెంచమ్మ ''కావాలంటే నా కూత దుడ్డే సెలవు జేసుకుంటా! మానాయిన కాబసివి మందు బెట్టేసింది. దాన్ని కక్కించేదాకా నిద్ర పోను'' అంది.

''పోయిన తడవ సోదిరంగం జెయ్యించిన ప్పుడు అయిదునూర్లు సదివించిందాంకా మీ అమ్మ సోదిగాని పైకి దిగిరాలేదు. సాంబ్రాణీ కర్పూరా నికే నూరుదాంకా వదిలించింది. తళిగల్నిండా రాసులు రాసులుగా బియ్యమూ పప్పూ కుమ్మరించినాంక గానీ ఆమెకు దయరాలేదు. మళ్లా అంత సెలవు జేసే పురసత్తు లేదునాకు. కావాల్లంటే అప్పుడు పట్టించిన టేపునే మళ్లాయిను...''

బత్తయ్య రుసరుసలాడుతూ మూల చెక్కపైనున్న టేపు రికార్డరును తీసి గడపదగ్గర పెట్టి, దాని వర్లను తీసుకెళ్లి బోరింగు మిషను స్టార్టరు పక్కనున్న ప్లగ్గులోకి జూనిపాడు. మాసిన సంచీలోంచీ కేసెట్టును తీసి టేపు రికార్డరులో పెట్టి



**వెలిసిన చీర పయిట తొలిగి, కిందికి జారిపోతున్న సంగతిగానీ, ముడివీడిన కొప్పులోంచీ జుట్టు చీపురు దుబ్బులా రేగుతున్న విషయాన్ని గానీ పట్టించుకోకుండా, చెంచమ్మ చేతులు జోడించుకుని కూర్చుంది.**

మీట నొక్కాడు.

టేపు రికార్డరులోంచీ బడబడమంటూ శబ్దాలు పుట్టుకురాసాగాయి. భీకరమైన చర్మవాయిద్యపు రొదతోబాటూ శంఖపు కూతలూ, గంటల గణ గణలూ ముంచుకొచ్చాయి. చిన్న మూలుగులా అస్పష్టంగా ప్రారంభమైన మగగొంతుకొకటి క్రమంగా పెద్దదై గుడిసెనంతా ఆక్రమించుకో సాగింది. ''బేత్రాయి సామి దేముడా!... పానకాల సామీ! కదిరి నర్సింమా! హుహుహూ... ఆంకాళమ్మా, మాంకాలమ్మా, తాలివంక గంగానమ్మా...''

వెలిసిన చీర పయిట తొలిగి, కిందికి జారిపో తున్న సంగతిగానీ, ముడివీడిన కొప్పులోంచీ జుట్టు చీపురు దుబ్బులా రేగుతున్న విషయాన్ని గానీ పట్టించుకోకుండా, చెంచమ్మ చేతులు జోడించుకుని కూర్చుంది. టేపు రికార్డరులోంచీ సోదిగాడి గొంతు డబ్బారేకులపైన రాళ్ళు దొర్లిస్తు న్నట్టుగా వెలువడసాగింది. తాను యిప్పుడు కూడా యెర్రావారిపాళెం దేవరింట్లో కూచున్న ట్టుగా అనిపించసాగింది చెంచమ్మకు. తానిప్పుడు తాటిమట్టలూ బోదా కలిపి కట్టిన చతురస్రాకారపు గుడిసెలోపల, తూర్పు ముఖంగా నిలబెట్టిన దేవుళ్ళ శిలువల ముందు కూర్చుని, సోదిగానికేసి భయం భయంగా చూస్తూనే అనుకోసాగింది ఆమె. మండుతున్న కర్పూరపు మంటల తాలులో, గుడిసెనంతా చుట్టేసిన పొగల మధ్య నడుముకు పంచమాత్రం చుట్టుకున్న సోదిగాడి నల్లటి ఆకారం యిప్పుడిప్పుడే రూపాన్ని ధరిస్తున్న భయంలా కాస్సేపూ, వెంటనే కరిగిపోతున్న భీభత్సంలా కాసేపూ తనను అయోమయానికి గురిచేస్తున్నట్టే అనిపించసాగింది ఆమెకు. సోదిగాడి శరీరంపైన్నుంచీ అతను నాముకొమ్ముతోనూ, తిరుచూర్ణంతోనూ పెట్టుకున్న బొట్లు చెమటతో తడిసి నేలపైకి బొట్లుబొట్లుగా రాలడం యిప్పుడు తన కళ్ళముందే జరుగుతున్నట్టుగా ఆమెకు భ్రమ కలగసాగింది.

''రేయ్... రేయ్... బిడ్డలాలా... నేన్రా... నేను... నన్నే ఆనవాలు బట్టలేర్రా మీరు? మీ కండ్లకు కావరం కమ్మిందిరా... నేనేగెవనానికి రాలేదా మీకు? నన్ను రమ్మని సోది జోస్యం జెయ్యించిందెందుకురా? రంగం బెట్టి నారని నేను యింతదూరం యెలబారొస్తే నన్నే తెలవనట్లు జూస్తారేందిరా మీరు? మిమ్మల్ని యిరసక తినేస్తా...''

''మా అక్కగదమా తల్లా నువ్వ... పెద్దము నెమ్మగదా!''

''మా అమ్మగదమ్మా నువ్వ... పెద్దమునెమ్మే గదా!''

టేపు రికార్డరులోంచీ అస్పష్టంగా వినిపించిన తమ గొంతులతో మళ్లీ బత్తయ్యా, చెంచమ్మా గొంతులు కలిపారు.

''అవున్రా... నేనేరా... పెద్దమునెమ్మేరా నేను... మీరు పిలస్తానే చక్కా యెలబారి రావాల్నారా నేను? నాకు మీరెంత బాకీ వుండారో తెల్సునా? నాలుగు కోళ్ళూ, రెండు గొర్రెలూ, రెండు బానల అంబితా, నాలుగు శేర్ల పరమాన్నం... అవన్నీ అక్కడ తెచ్చిపెట్టండి... అప్పుడు మాట్లాడతా మీతో యిలా విడిగా...''

''నువ్వేమడిగినా కాదనకుండా అమర్చి

పెడతావున్నాడు గదమ్మా మా నాయిన? అన్నాయంగా ఆయిన్ను నడిదోవలో దిగ్గొలికేసి పోతివెందుకు తల్లా?'' టేపు రికార్డరులోంచీ చెంచమ్మ గొంతు ప్రశ్నిస్తోంది.

''ఆ మడిసి సంగతి నాకు చెప్తారా మీరు? వానిది కడుపుగాదు. కొండపల్లి చెరువు తూము. మూడు మూడు నాళ్లకంతా యింకో బసివిని వాడు మల్లు కోకుంటే అప్పుడు జూడండి...'' టేపు రికార్డరులోంచీ సోదిగాని గొంతు పాత పేలికలు చింపినట్లుగా కీచుకీచుమని పలుకుతోంది.

''నీ మాటిని నీ కూతుర్నే గట్టుకుంటి కదక్కా! నాతోగూడా చెప్పకుండా యిట్లెల బారిపొయ్యేది నాయిమేనా?'' బత్తయ్య దీనంగా అడుగుతున్నాడు.

''ఆడ బిడ్డకు సమత్సరానికోకతూరైనా సాగెం జెయ్యించినావారా నువ్వు? నువ్వు కోకెత్తిచ్చి యెన్ని దినాలయ్యింది? యిప్పటికైనా సాగెంజెయ్యించు... నీ కడుపులో పడతా... లేకపోతే కాటేరికి జెప్పి నీ కొంప గుండం జేయిస్తా...''

టేపు రికార్డరు టప్పున ఆగిపోగానే గుడిసె లోపల నిశ్శబ్దం వికృతంగా మేల్కొంది. చెంపల పైన్నుంచీ కారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ ''కరెంటు పొయ్యింది'' అంది చెంచమ్మ.

''గొంతుసొద్దిగానిదే అయినా మా అక్కే సొయంగా మాట్లాడతా వుండాదని యెంత బాగా తెలుస్తా వుండాదో జూడు...'' అంటూ బత్తయ్య చెంపలేసుకున్నాడు.

''మంగళం దగ్గిర పాములు జాస్తీ అని అందురూ అంటారు. యానాదోళ్ళకు పాములంటే బయిమేలని దబాయించింది మా అమ్మ. భాకరాపేట అడవిల్లో దినానికొక నాగుబాము తోలుతీసి అమ్మలేదా అని యెగరేసి మాట్లాడింది. కడాకు జానెడు పాము నోట్లో బడి పొయ్యింది... మా అమ్మేగానీ బతికుంటే...'' చెంచమ్మ మాటల్ని సాగదీపి యేడుపు రాగం తీసింది.

''లోపల గుచ్చోని యేంజేస్తా వుండార్రా? కూలీ పనుండాది వస్తారా?'' అంటూ తలుపు తోశాడో వ్యక్తి.

బత్తయ్య వుషారుగా టేపు రికార్డరు తీసి ట్రంకు పెట్టెపైన పెడుతూ ''యెందుకు రామన్నా! పద్దినాలుగా పనిలేకుండా చేతిలో నయాపైసా లేదు. పద... యిద్దరం వస్తాం'' అన్నాడు. చెంచమ్మ గూడా బయటికొచ్చి గుడిసెకు తాళం తగిలిస్తూ ''యేం పని మద్దన్నా?'' అని అడిగింది.

''మూడో ఫ్లోరు పైకి యిటికరాళ్ళు మొయ్యాల... లోడ్డురాళ్ళు...'' చెబుతూనే ముళ్ళ పొదల మధ్య యేర్పడిన కాలిదోవలో నడవసాగాడు మద్దయ్య.

ముళ్ళ చెట్లతో నిండిన మైదానంలో, యిండ్లు కడుతున్నచోట కూలీల సంరంభం మొదలైపోయి వుంది. సైకిళ్ళకు టిఫిను కారియర్లు కట్టుకున్న కూలీలు కొందరు మట్టిబాటలో సాగిపోతున్నారు.

కాంక్రీటు స్థంభాలపైన నిలబడిన మూడంతస్థుల కట్టడమొకటి పాతకాలపు రాక్షసబల్లి కంకాళంలా భీకరంగా కనబడుతోంది. దాని ముందు డొక్కు మోటారు బైకుపైన కూర్చుని, ఆదెయ్యతో మాట్లాడుతున్న మేస్త్రీ ''వాళ్ళొద్దులేరా మద్దిగా! ఆ పనిప్పుడే ఆదిగానికి గుత్తకొప్పించేసినా... నన్నూరుకు తెంచేసినా...'' అన్నాడు.

''రమ్మని జెప్పంపించి, వచ్చినాంక పనిలేదు పొమ్మంటే అదేం నాయిం అన్నా?'' అంటూ బత్తయ్య ఆక్రోశించాడు.

''కూలికి జేసేదానికి ఆదిగాడు వొప్పుకోలేదురా! వాడు పక్కింటికుండే వాచ్‌మేను. పిలిస్తే పలికే మనిషి... వాన్ని కాదన్లేను. వాడొప్పుకుంటే మీరు నలుగురూ కూలీకే పనిజేసుకోండి. నాకేం అభ్యంతరం లేదు'' అన్నాడు మేస్త్రీ.

''యీడ నలుగురు జేసేంత పనేముండాది? నాకూ నా పెండ్లానికే చాలదది...'' అంటూ ఆదెయ్య యిటుకల వైపుకు వెళ్ళిపోయాడు.

బత్తయ్య యేడుపు ముఖం పెట్టుకుని వెనుదిరిగాడు.

''అన్నీ పైన్నుంచీ చూడాల్సినోళ్ళు చూస్తానే వుంటార్లే నాయినా? కొత్తపెండ్లాం మాటిని కూతుర్నింత కష్టంబెట్టేది మంచికిగాదు'' అని మెటికలు విరిచింది చెంచమ్మ.

తమ గుడిసె దగ్గరికొచ్చాక ''మా అమ్మ పోతానే మా నాయిన దెయ్యమయి పొయినాడు. యిట్లెందుకు మారిపొయినాడో తెలుసుకునేదాంకా నాకూ తిండీ నీళ్లూ సయించవు. యెర్రావారి పాళెం దేవరిండ్లకు పొయ్యి సోదిరంగం జెప్పించే కావాల్ల'' అని గుణిసింది.

''మల్లా మల్లా ఆ మాట అనద్దు. అంటే జరిపించే కావాల్ల... లేకపోతే పెద్దోళ్ళకు వుగ్రమొస్తింది. అనావస్యంగా సెలవు జెయ్యించేంత దుడ్డేమీ లేదు నా దగ్గర...'' అని కసిరాడు బత్తయ్య.

''ప్లాటంతా పరిగిల దోలేసి యాడికి పోయినార్రా యిద్దరూ? దొంగెవుడైనా వచ్చి చేతికి దొరికింది యెత్తుకోనిబొయ్యినా అడిగే దిక్కులేదు. యిదేనా వాచ్‌మేన్లు చెయ్యాల్సిన పని?'' అంటూ దూరం నుంచే గదమాయించాడో ముసలాయిన.

''యిక్కడేం సామాన్లుండాయన్నా దొంగతనం జేసేదానికి? రెండు నెల్లుగా పనులాపేసినావు. వాచ్‌మేను జీతంతో యిద్దురు బతికేదానియితాదా! ఆ పక్క మేస్త్రీ కూలీకి రమ్మంటే పోతిమి. నీదయ వల్ల అది గూడా దొరకలేదు'' అన్నాడు బత్తయ్య నీరసంగా.

పునాది గోడల మధ్య పోసిన యిసుకలోకి నీళ్లెన్ని పారాయో పరీక్షించి చూస్తున్న ముసలాయిన ''హౌసింగ్ లోను యీ వారంలో సాంక్షనయిపోతిందని మా అల్లుడు అంటా వుండాడు. అది చేతిలోకి వస్తానే పని ఆరంభంజేసేదే! ప్లాటు చుట్లావుండే కంపా చెట్టూ కొట్టేసి సీరుజేసేది గూడా వాచ్‌మేను పనేగదా? నాగుబాములు రెండు యీ పక్కనే తిరగతా వుండాయని పక్క ప్లాటు వోనరు ఆగిత్యం జేస్తా వుండాడు. ఆ మాటిన్నప్పట్నించీ మా ఆడోళ్ళు యీ పక్కకే రావటం లేదు. యానోనోన్నంటావు. పాముల్ని గూడా పట్టలేవు'' అని దబాయించాడు.

''అవి నాగుబాములై వుండవన్నా! జెర్రిపోతులైయుంటాయి. అందుకే మనుషుల పోవిడి తగలంగానే దౌడు తీస్తావుండాయి. చేతికి దొరకాటం లేదు'' అన్నాడు బత్తయ్య వినయంగా వంగి.

''రేపు సాయంత్రం లోపల ఆ పాముల్ని పట్టి చంపక పోయినావంటే గొమ్మునుండను. నువ్వు వేరే తావులో పనియెతుక్కోవలిసిందే!...'' అన్నాడు ముసలాయన. తరువాత సరసరా దూరంగా కడుతున్న యింటి దగ్గరికెళ్ళి ఆదెయ్యతో యేదో మాట్లాడసాగాడు.


కాకతీయ గడపలో కాలు పెట్టండి
మీ గుమ్మానికి కళ్యాణ తోరణం కట్టండి

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999



శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |

www.kaakateeya.com

యెండ బాగా పైకెక్కి రావడంతో చెట్ల నీడలు దట్టంగా పడుతున్నాయి. యెక్కడి నుంచో కాంక్రీటు మిషను శబ్దం వినబడుతోంది.

''విద్యానగరంలో పనులు జేసుకుంటావుండే మనల్ని యీ చెన్నమునికి తగిలించినాడు మీ నాయిన. దగ్గిరిగా వుంటే కమ్మల్నెట్లయినా వసూలు జేసుకోవచ్చని యీ యెత్తేసినట్లుండాడు. యిప్పుడీ పాముల్ని బట్టే వుద్యోగం గూడా మనదేనా?'' బత్తయ్య పెళ్ళాంపైన విరుచుకపడ్డాడు.

''ఆపొడు కమ్మల్ని దెచ్చి ఆయిన ముగాన గొట్టమంటే యినవు నువ్వు?'' చెంచమ్మ కస్సుమంది.

''అసలూ వడ్డీ గలిసి కమ్మల రేటుకంటే యెక్కువైపొయ్యింది. మనకోసరం ఆ సేటు యెతుకని తావులేదని వాళ్ళ గుమస్తా జెప్పినాడు. అమ్మి మన బిడ్డకేదైనా తీసియ్యమని మీ అమ్మ చదివించిన కమ్మలు అవ్వి. దాన్ని యిమ్మని అడిగేదానికి మీనా యినెవుడు?'' బత్తయ్య కోపంగా వాదించాడు.

''పెట్టుకోని అణవరించే బొగిసిలేకుండా బంగారట్లా బిడ్డను గూడా దారబోసుకుంటిమి.'' చెంచమ్మ మళ్ళీ యేడుపు మొదులుబెట్టింది. ''అప్పటికీ ఆస్పత్రులకు తిరిగి నూర్లు నూర్లుగా సెలవుజేస్తిమి. సందులొస్తే యిట్లయితిందని యెవురికి దెలుసు? కాటేరికి పెడ్డాం రమ్మంటే నువ్వినలేదు...''

''అంత దుడ్డే వుంటే ఆస్పత్రుల్లోనే సెలవు జేసుండమా? నింద నాపైనేయద్దు. రుడం తీరిపోతే యెవుడైనా చేసేదేంలేదు. పుట్టేదీ జచ్చేదీ యెవురి చేతల్లో వుండాది? అంతా తలరాత. అప్పు తీరతానే యెలబారిపోవాల...'' మాట్లాడుతూనే బత్తయ్య టేపురికార్డరును గడప దగ్గరపెట్టి, వైర్లను స్టాండులో చెక్కాడు. పాత సంచిలోంచీ మరో కేసెట్టును తీసి టేపురికార్డరులోకి జూనిపాడు. అతను మీట నొక్కుతూనే టేపులోంచీ డప్పుల మోత పెద్దగా వినబడడం మొదలెట్టింది. లోహపు గిన్నెలు గీసుకుంటున్నట్టుగా గూబలు గుయ్యిమనిపించే సవ్వడం ముంచుకురాసాగింది. వొకదానితో వొకటి గొడవపడుతున్నట్టున్న రకరకాల శబ్దాల మధ్యలోంచీ బొంగురుపోయిన గొంతుకొకటి రాగాలు తీస్తూ మాటల్ని సాగదీసింది.

చెంచమ్మ మంచంపైన భర్త పక్కన కూచుని చేతులు జోడించుకుంది. మల్లంగుంట దేవరింటిలో దేవుళ్ళ శిలువల ముందు కూర్చున్నట్లే అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు బత్తయ్య. మండుతున్న కర్పూరమూ, సాంబ్రాణీల పొగలు, విస్తరాకుల్లో వడ్డించిన తినుబండారాల వాసనలూ తన ముక్కుపుటాల ముందు యిప్పటికీ మోహరించే వున్నట్టుగా చెంచమ్మ కనిపించసాగింది. దేవరింటి ముందు కూర్చుని సోదిగాడి మాటలు వింటూ రంకెలేస్తున్న జనాల రభస, స్పష్టంగా వినబడుతున్నట్లే అనిపించసాగింది యిద్దరికీ.

''డప్. డప్... గ్రీణ్ గ్రీణ్.. టుర్ర్ టుర్ర్... రేయ్ బిడ్డలాలా! వోబిలం వోబులు సామి సాక్షింగా, కదిరి నర్సింహ సామి సాక్షికంగా, తిర్పతి యెంగటేశ్వర సామి సాక్షికంగా... నన్నెందుకురా రంగంపెట్టించి రప్పించానారు?...'' మల్లంగుంట సోదిగాడి గొంతు దగ్గు తెరలతో శృతి తప్పుతోంది.

''నువ్వు మా కొడుకు గదసామీ! రంగకార్ల వొళ్ళుపై కొచ్చి మమ్మల్ని...'' టేపురికార్డరులోంచీ యేడుస్తూ పలవరిస్తున్న తమ గొంతులు వినబడగానే చెంచమ్మ వెక్కిళ్ళు పెట్టసాగింది.

''అంతకష్టపడేకంటే రెండేండ్లు గూడా వుండకుండాపోతివిగద నాయినా? నన్ను గొడ్డుబోతును జేసి పోయినావెందుకురా దేముడా?'' టేపు రికార్డరులోంచీ చెంచమ్మ గొంతు అస్పష్టంగా వినబడుతోంది యేడుస్తున్న భార్య భుజంపైన చేయివేసి మరో చేత్తో తన కన్నీళ్ళు తుడుచుకోసాగాడు బత్తయ్య.

''అందుకు సోదిగాళ్ళ పైకిరాన్రానేను... మల్లంగుంట సోదిగాని కైతేనే పలకతా... నన్ను సరింగా అణవరించలేదురా మీరు... నాకింకా చానా బాకీలుండాన్రా మీరు.. చిన్న దేవర బెడితే నేనొప్పుకోను. మూడు కుందేళ్ళూ, అయిదు కోళ్ళూ, యేడు బెళబాయిలూ, తొమ్మిది కాయిలూ, పన్నెండు నిమ్మకాయిలూ, జతపంచలూ, సవకమూ, తొమ్మిది మూర్ల చీర...''

''యేడు బెళబాయిలు తెమ్మంటే మూడే దెచ్చినావాపోద్దు... అందుకే నా బిడ్డింకా నా కడుపు లోపల్లేదు...'' చెంచమ్మ వెక్కుతూ మూల్గింది.

బత్తయ్య ముఖం అవతలికి తిప్పుకుని ''ఆ మాత్రం రుడం మిగిల్తేనే వాడు మన దగ్గరికి వచ్చేది? రుడమంతా తీరిపోతే మన పక్కకు ముఖం గూడా తిప్పడు. బతికుండేటప్పుడు వాని బుద్దెట్లాంటిదో చూళ్ళేదామనం?'' అని రెట్టించాడు.

గుడిసె బయట యెండుటాకులు గలగలమన్నాయి.

''దొంగనాయితా జెర్రిపోతు...'' అని పళ్లు కొరుకుతూ గడపదాటి బయటికి పరిగెత్తు కొచ్చాడు బత్తయ్య.

''యెవుడ్రా వాచ్‌మేను యిక్కడ?''

తమర కొయ్య కోసం వెతుక్కుంటున్న బత్తయ్య వులిక్కిపడి వెనుదిరిగి చూశారు. కాకీ దుస్తులు కనిపించగానే కంగారుపడుతూ ''నేనే సా...'' అంటూ రెండడుగులు వెనక్కేశాడు.

''తాటి తోపులో దోపు జరిగినప్పుడు ఆ పక్కన్నే వాచ్‌మేనుగా వున్నోడు సావీడు... యీ ఆదెయ్యకు సొయానా అల్లుడు...'' అని చెబుతూ మద్దయ్య ముందుకొచ్చాడు.

''దానికీ నాకూ సంమంధం లేదు సా... ఆ దొంగనప్పుడు జెయిల్లో గూడా యేసినారు'' అన్నాడు బత్తయ్య గుక్కిళ్ళు మింగుతూ.

''ఆ పక్క షెడ్డులో పెట్టిన కీళ్ళూ చిలుకుల సంచిక కాళ్ళొచ్చి నడుచుకోని పొయ్యిందా?'' లావుగా దిట్టంగా వున్న పోలీసు కంఠంలోంచీ దారి సరిగ్గా దొరకనట్టుగా మాటలు మూలిగాయి.

''యేవూర్రా మీది?..''

''వానిది గూడా మల్లంగుంటే సా...'' అని పళ్లికిలిస్తూ ఆదెయ్య ముందుకు నడిచి వచ్చాడు. ''నిన్న సాయంత్రం ఆ షెడ్డు పక్కన తిరగతలాడ తావున్నాడు.''

పోలీసు ముఖాన్ని వికారంగా పెట్టుకుని ''తూ! దూరంగా పో వాసన చంపేస్తా వుండాది. తెల్లారీ తెల్లారక ముందే యెన్ని దరాములు మింగినావు?'' అని అరిచాడు. ఆదెయ్య వెనక్కు రెండడుగులేసి పళ్లికిలించాడు.

''మా మామ మాదిరిగా నేను అడవుల్లో యేటకు పోనుసా... దొరికిందాంతో గొమ్ము నుండే వంశం మాది. వాళ్ళ వంశంలో మడుసులు బానబానలు తాగేస్తారు. యాటలు యాటలు మింగేస్తారు'' అన్నాడు బత్తయ్య వుక్రోశంగా.

''చూసేదానికి చచ్చే మనిషి మాదిరుండాడు. వీడెన్ని బానలు తాగతాడు!'' అని అడిగాడు పోలీసు వెటకారంగా.

''మనిషిని చూసి యామార్దండిసా... రెండు బానలు రెండే నిమిషాల్లో ముగించేస్తాడా మడిసి'' బత్తయ్య కోపంగా వురిమి చూశాడు. ఆదెయ్య పళ్ళు కొరుక్కోవడం చూశాక మరింత ఆవేశంతో ''ఆ మాట అయిన పెండ్లామే సోదిగాని పైకొచ్చి చెప్పింది. చచ్చిపోయిన పెద్దోళ్ళు సోదిగాళ్ళ వొళ్ళు పైకొచ్చి తప్పుడు మాటలు జెప్పరు'' అన్నాడు.

''అట్లయితే కొంచెం వక్కాకుబెట్టి ఆ పెద్దోళ్ళను పిలిపించు. యీ దొంగతనం యెవురు జేసినారో తెల్సుకోవాల...'' అన్నాడు పోలీసు యెగతాళిగా.

''యీ పక్కన జెర్రిపోతులు రెండు తిరుగులాడతా వుండాయని మావోనరు నిష్టూరం జేస్తా వుండారు సా.. యానోడుగా వుండి అవిట్ని పట్టుకోలేకుండా పోతా వుండానని మౌనంగా గడిగేస్తా వుండాడు. అవిటి కోసరం యెతకనితావులేదు...'' అన్నాడు బత్తయ్య దీనంగా. తరువాత ''మావోళ్ళందరూ వాచ్‌మేనుద్యోగాల్లో యెత్తిన చెయ్యి సా... మేం కావిలుండే తోపుల్లోనించీ పిందే పిసురుగూడా దొంగతనం పోదని పేరెత్తినాము'' అన్నాడు బింకంగా.

పోలీసు ముఖంగా చిట్లించుకుని ''అయితే మర్యాదగా అడిగితే మీరెవుతూ నిజెం చెప్పనంటారు! పాత రికార్డుల్లో మీ పేర్లు లేవంటారు'' అని విసుక్కున్నాడు.

''అదెప్పుడో ఆగెవిదెగ్గిరుండే బందుగుల్ని చూసేదానికి పోయినప్పుడు...''

''ఆ పొద్దు వుత్తల పుణ్యానికి...''

''ఆ దినం ఆ తావులో నేను లేను సా...'' ముగ్గురు కాపలా ''యీ యింటి వోనరెవుడు?'' అని అడిగాడు.

''ఆయిన కుప్పం బాదూరులో బాంకీ మేనేజరంట సా... యీడ వాళ్ల మామ యిల్లు గట్టించే పని చూసుకుంటా వుండాడు'' అని జవాబు చెప్పాడు బత్తయ్య.

పోలీసు చేతివాచీకేసి చూసుకున్నాక కోపంగా ''బతికున్నన్నాళ్లూ వాచ్‌మేన్లుగా పడిచస్తావుండారు. యిండ్లు గట్టించే వాళ్ళు యెందుకంత పచ్చంగా



## జర్నలిస్టుగా భూమిక

అందాల నటి భూమిక ఏ పాత్ర పోషించినా బాగానే ఉంటుంది. 'మిస్సమ్మ'గా ఆమెను మరిచిపోలేం. 'ఖుషి' సినిమాలో ఆమె పాత్ర కూడా అలాగే మరిచిపోలేనిది. ఆ రెండు పాత్రలు తనకి చాలా ఇష్టమైనవే కాదు, ఆ పాత్రలు తన జీవితంలోనివే... అన్నట్టుగా అనిపించాయని భూమిక చాలా మంది దగ్గర పేర్కొనట్టుగా వినికిడి. ఆ సంగతి అలా ఉంచితే ఇప్పుడు రవిబాబు దర్శకత్వంలో వస్తోన్న 'అనసూయ'లో ఆమె పోషిస్తోన్న పాత్ర, తను నిజ జీవితంలో అనుకున్నదేనని భూమిక పదిమంది ముందు చెబుతోంది. అనసూయలో భూమిక జర్నలిస్ట్‌గా నటిస్తోంది. పెద్దయితే జర్నలిస్ట్ కావాలన్నది భూమిక కోరికట! ఆ కోరిక ఇప్పుడిలా నెరవేరిందని చెబుతోంది. ఆశించిన జీవితం సినిమాలో పాత్ర రూపంలోనైనా లభించడం అదృష్టం అంటోందామె.

వుండారో, మీరెందుకిట్ల అగోరిస్తావుండారో తెల్సునా? నీతే న్యాయం నేర్చుకోరా మీరు? సత్యధర్మం అంటే యేందో తెల్సునా?'' అని గాండ్రించాడు.

బత్తయ్య వెనక్కో అడుగేసి ''అది కాదు సా...'' అంటూ యేదో చెప్పబోయాడు.

పోలీసు వురిమి చూసి ''నోర్మూసుకో... కావాలంటే ఆ పెద్దోళ్ళనే పిలిపించి అడిగి తెలుసుకో...'' అని వెటకారంగా అరిచాడు. తరువాత విసవిసా వెనుదిరిగి ''యిండ్లను మీరు కాపలా గాస్తావుండారో లేదోగానీ మిమ్మల్ని కాపలాగాయలేకుండా మేం తనకలాడి పోతావుండాం. అందుకే మిమ్మల్నంతా తెల్లోడు రికార్డుల్లోకెక్కించింది. రేపు తెల్లారికంతా దారబోయిన సొత్తు తావు జేరకుండాపోతే మీ ముగ్గురికీ చెమడాతోలు వలిచేస్తాను'' అన్నాడు.

దూరంగా వో యింటి పునాదుల దగ్గర కూలీలు ట్రాక్టరు లోంచీ యిటుకలు దించుతున్నారు. మరో యింటి దగ్గర సెంటరింగ్ పనివాళ్ళు డబ్బా రేకు చట్రాల్ని మోగిస్తున్నారు. నడినెత్తి పైకెక్కి వచ్చిన యెండలో కొందరు మేస్త్రీలు గోడలు కడుతున్నారు.

పోలీసు వెనకే చేతులు నలుపుకుంటూ వెళ్తున్న కాపలా వాళ్ళనిద్దరినీ భయంగా చూస్తూ బత్తయ్య గుడిసె లోపలికొచ్చాడు.

గోడలకు బల్లిపిల్లలా అతుక్కుని కూర్చున్న చెంచమ్మ ''మా నాయిన కావాలని నీ మింద నిందేస్తావుండాడు. ఆయినెందుకింత కటినం అయిపొయినాడో? తెలిసో తెలియకుండానో మనమేందో తప్పు జేసే వుంటాము. సోదిరంగం జెయ్యించి జబాబు తెల్సుకునే దాంకా నేనింకో పని జెయ్యను'' అంది కత్తితో నరికినట్టు కచ్చితంగా.

ఆరిపోబోతున్న బీడీని బుగ్గలు నొక్కులు పడేలా లాగుతూ ''ఆ ముండమోపిది గంగమ్మ. యెంత దుడ్డయినా దానికి చాలటం లేదు. యీ మడిసి సంపాదించిన దాన్నంతా దొంగతనంగా ముందు మొగుడి బిడ్డలకు చేరేస్తా వుండాది. నూర్లు నూర్లు సెలవు జేసి, సోదిరంగం జెయ్యించి తెల్సుకోవాల్సినంత యిదేంలేదు దీంట్లో. గొమ్ము నుండు...'' అని కసురుకున్నాడు బత్తయ్య.

''మీ యిండ్లల్లో ఆడదానిగా పుట్టేదానికంటే అడువుల్లో మానుగా పుట్టినా బాగుణ్ను'' అని నిష్టూరపోయింది చెంచమ్మ.

బత్తయ్య నిట్టూర్చి, నిర్లిప్తంగా నవ్వేసి ''దేనికైనా అడిగి రావాల్ల... నాగ్గూడా యీ కావిలి పని యిడిసి పెట్టేసి, యింటి వోనరైపోతే బాగుణ్ణని వుండాది. ఆ పోలీసాయనకు దొంగతనం జేసిందెవురో తెల్సుకోవాలనుండాది. యీ మాదిరి పోసుగోలు పనులకంతా సోదిరంగం జెయ్యించి రమ్మంటే కాటేరికి వుగ్రమొస్తాది. సరింగా రెండంటించినాడంటే రగతం గక్కుకోని పడతాం'' అని మందలించాడు.

గాలి వీచకపోవడంతో గుడిసె బయట పొదల దగ్గిరి నుంచీ అలికిడేమీ వినరావడం లేదు. గుడిసె లోపల ట్రంకు పెట్టెపైన పాత టేపురికార్డరు వేలాడుతున్న గోగుదారం చుట్టూ చీగటీగలు గింగిరాలు తిరుగుతున్నాయి. పలకరించుకుంటే ప్రమాదమేమోనన్నట్టుగా గుడిసెలోపల యిద్దరు వ్యక్తులూ చాలాసేపు మౌనంగా వుండిపోయారు.

దూరం నుంచీ వొక్కసారిగా జనాల గోల పెద్దగా వినవచ్చింది. బత్తయ్య పెదవులు చప్పరించాక, పైకిలేచి గుడిసె బయటికొచ్చాడు. అవతలి యింటి వాచ్‌మేను ''రేయ్ బత్తిగా... మీ మామరా.. మీ మామేరా!'' అంటూ గావుకేక పెట్టాడు.

యెవరో తరిమినట్టుగా బత్తయ్య ముందుకు పరిగెత్తాడు. మూడంతస్థుల యింటి పక్కన, యిసుక కుప్పల మధ్యలో కూలీలందరూ గుంపుగా నిలబడి గగ్గోలు చేస్తున్నారు. గుంపులోని మనుషుల్ని పక్కకు లాగుతూ మధ్యలోకి దూరాడు బత్తయ్య.

వర్షాలు లేక బండలా మారిన గట్టి నేలపైన గోదురు కప్పలా పడి వున్నాడు ఆదెయ్య. చుట్టూ నేలపైన రక్తం తడితడిగా మెరుస్తోంది.

''కొన్ని కొన్నిగా మొయ్యకుంటే యినకుండా తట్టనిండా యెత్తుకోని యెలబారి నాడురా...'' వో స్త్రీ బొంగురు గొంతుతో యేడుస్తోంది.

''గొంతుల దాంకా మందుపై నుండాడు. పైన మెట్లపైన నెమ్మింకా ఆరలేదు. ముసిలోనికి కాలు జారింది'' యెవరో వాపోతున్నారు.

''నాయినా... నాయినో'' అంటూ చెంచమ్మ పెద్దగా అరిచి శవంపైన కూలిపోయింది.

''మామా... మామో...'' అని యేడుస్తూ బత్తయ్య కూలబడ్డాడు.

గుంపుకవతల మేస్త్రీ వొకతను ''వోనరును తోడ్కొని రాబోరా?'' పోలీసులు వచ్చే లోపల దానం జేసేది మేలు. లేకపోతే టేషన్ల చుట్టూ తిరగాల... కావాలంటే ఆ పెండ్లాముగాన వెయ్యో రెండు వేలో పారేయమందాం... యీ పొద్దు పనంతా పంచేటయి పొయ్యింది'' అని కూలీనొవడ్ని సైకిలుపైన తరుముతున్నాడు.

యేడచ యేడ్చీ గొంతు రాసిపోయిన తర్వాత, పెగిలీ పెగలని పెదవుల్ని బలవంతంగా కదుపుతూ ''బతికినన్ని దినాలూ మా అమ్మను కొంగిడిసి పెట్టకుండా తిరిగితివి. యింత చిన్నాగా ఆమె కోసరం యెలబారి పోతావనుకోలేదు నాయినో...'' అని రాగం తీసింది చెంచమ్మ.

''ఆయినకు మనమంటే బలే బమ. మళ్ళా ఆరు నెల్లకంతా నీ కడుపులో బడతాడు జూడు. దివసాలు తీరతానే యెర్రావారిపాళెం పోదం. సోదిరంగం పెట్టించి మీ నాయిన్ను సోదిగాని పైకి రమ్మని అడుక్కుందాం. ఆయినకేం గావాల్లంటే అది తెచ్చి పొంగిల్లు పెడదాం...'' అన్నాడు బత్తయ్య యేడుపుతో పూడుకుపోతున్న గొంతుకతో.

చెంచమ్మ యేడవడం గూడా మరచిపోయి, కళ్ళార్పకుండా మొగుడికేసి చూసింది.

కన్నీళ్ళు రాలుతుండగా కనురెప్పలల్లార్చిన బత్తయ్య ''యెర్రావారిపాళెం సోదిగాడు భలే మగత్యముందే సామి... యెంత పశ్నకైనా జబాబు యిలావిడిగా చెప్పించేస్తాడు'' అన్నాడు.

కడుతున్న మూడంతస్థుల యింటి నీడ ఆదెయ్య శవంపైన పెద్ద ప్రశ్నార్థకపు గుర్తులా పడుతోంది.

★